ఎన్నికల ప్రచారానికి 2న అమిత్‌షా రాక

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఏప్రిల్ 2న రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్ తెలిపారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2న ఉదయం 9 గంటలకు బీజేపీ, జేడీఎస్ ముఖ్యనేతలతో కలసి అల్పాహార విందులో పాల్గొంటారన్నారు. 11 గంటలకు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో జరిగే పార్టీ శక్తి కేంద్రాల కార్యకర్తల సభలో ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 2 గంటల కు తుమకూరు, దావణగెరె, చిత్రదుర్గ నియోజకవర్గాల ప్రముఖులతో సమావేశమవుతారన్నారు. సాయంత్రం 6 గంటలకు చెన్నపట్టణలో రోడ్‌షోలో పాలొంటారన్నారు.

మంత్రులకు అగ్నిపరీక్ష

వారసులను గెలిపిస్తేనే అమాత్యులుగా కొనసాగింపు

కాంగ్రెస్ అధిష్ఠానం అల్టిమేటం

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రులకు లోక్‌సభ ఎన్నికలు గుబులు పుట్టిస్తున్నాయి. శాసనసభ ఎన్నికల్లో 135 స్థానాల్లో గెలుపొంది శక్తివంతమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలకు మంత్రిపదవులు కేటాయించింది. మంత్రులుగా సంతృప్తిగా ఉన్నామని భావిస్తున్న తరుణంలో లోక్‌సభ ఎన్నికలు వారికి సవాలుగా మారాయి. నాలుగైదు నెలల నుంచి లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో మంత్రులు, పార్టీ అధిష్ఠానం మధ్య పలు మలుపులు తిరిగాయి. లోక్‌సభ ఎన్నికలు పార్టీకి ప్రతిష్ఠాత్మకమని, విజయం సాధించాల్సిందేనని అధిష్ఠానం స్పష్టమైన సందేశం ఇచ్చింది. ఇందుకోసమే కనీసం పది మంది మంత్రులకు లోక్‌సభ టిక్కెట్లు ఇవ్వాలని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ప్రతిపాదించగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభ్యంతరం తెలిపారు. సమస్య ఢిల్లీ నేతల చెంతకు వెళ్లగా అప్పటికప్పుడు మంత్రులు పోటీకి వద్దని సముదాయించారు. మంత్రి పదవి కావాలంటే ఎంపీగా పోటీ చేసి గెలవాలనే అంశం కూడా చర్చకు వచ్చింది. అభ్యర్థులు ఎవరు, వారిని గెలిపించే బాధ్యత ఎవరు తీసుకోవాలనే అంశంపై తర్జనభర్జన జరిగింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులదే ఎంపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత అని మెలిక పెట్టారు. అందుకు అవసరమైన వనరులు సమకూర్చాల్సిందేనంటూ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

ఎవరో అభ్యర్థికి తామెందుకు భారం మోయాలని భావించిన మంత్రులు తమ వారసులకు టిక్కెట్లు ఇప్పించుకునేందుకు సిద్ధమయ్యారు. గెలిస్తే ఎంపీ... లేదంటే రాజకీయంగా ఎదుగుతారని భావించారు. ఇలా ఏకంగా ఆరుగురు మంత్రులు తమ పిల్లలకు టిక్కెట్లు కోరారు. వారు అడిగిందే తడవుగా అభ్యర్థులుగా ప్రకటించారు. మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్ బోస్, సతీశ్‌జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి, శివానంద పాటిల్ కుమార్తె సంయుక్త పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు సాగర్‌ఖండ్రె, లక్ష్మీహెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ హెబ్బాళ్కర్, రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యరెడ్డి అభ్యర్థులయ్యారు. ఇక దావణగెరె నుంచి మంత్రి మల్లికార్జున భార్య ప్రభా మల్లికార్జునకు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సీతారాం కుమారుడు రక్షారామయ్య అభ్యర్థులయ్యారు. ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎంవీ రాజీవ్‌గౌడ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు, రాష్ట్రమంత్రి ప్రియాంక ఖర్గే బావ రాధాకృష్ణ దొడ్డమని, శివమొగ్గ నుంచి మంత్రి మధుబంగారప్ప అక్క గీతా శివరాజ్‌కుమార్ అభ్యర్థులయ్యారు. ఇక మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇలా మంత్రులు, సీనియర్ నేతలతో సంబంధాలు కలిగినవారే ఎక్కువమంది అభ్యర్థులయ్యారు. మిగిలిన జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులకు ఇదో టాస్క్‌గా మారింది. కేవలం మంత్రులకే కాకుండా బోర్డులు, కార్పొరేషన్ పదవుల్లో కొనసాగుతున్న ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు ముచ్చెమటలు పడుతున్నాయి. బోర్డులు, కార్పొరేషన్ పదవులు పొందేవేళ పోటీపడిన వారు ఎన్నికల్లో మీ పనితీరు గమనిస్తామనే హెచ్చరికలు జారీ కావడంతో అయోమయంలో పడ్డారు.





టిక్కెట్లు ఇప్పించుకున్నామంటే సరిపోదని, విజయం సాధించాల్సిందేనని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టమైన సందేశం ఇచ్చింది. అభ్యర్థి ఓడితే అధికారాన్ని వదులుకోవాల్సి ఉంటుందని సున్నితంగా హెచ్చరించింది. ఇలా పార్టీ అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేయడంతో మంత్రులకు ఉచ్చు బిగుస్తోంది. రాష్ట్రంలో రెండు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. తర్వాత మంత్రుల భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందనేది తేలనుంది.

బీజేపీ-జేడీఎస్‌కు సుమలత షాక్

మండ్య నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ..?

బెంగళూరుకు తరలి వచ్చిన అభిమానులు



బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల్లో మండ్య నుంచి గెలుపొందిన ప్రముఖ నటి సుమలత మరోసారి పోటీ చేసే ఆలోచనలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో మండ్య నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. కాంగ్రెస్-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి, మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడు, నాటి సీఎం కుమారస్వామి వారసుడు నిఖిల్‌ను ఓడించారు. ఏడాది క్రితమే బీజేపీకి మద్దతు పలికారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆమె భావించారు. ఊహించని విధంగా బీజేపీ-జేడీఎస్ పొత్తు పెట్టుకోవడం, ప్రత్యేకించి మండ్య స్థానాన్ని జేడీఎస్ కోరుకోవడంతో బీజేపీ అంగీకరించింది. దాదాపు నెలరోజులపాటు బీజేపీ అగ్రనేతలు మండ్య విషయమై స్పష్టత ఇవ్వలేదు. జేడీఎస్ పట్టుబట్టడం, అదే స్థానం నుంచి కుమారస్వామి పోటీకి సిద్ధం కావడంతో బీజేపీ నేతలు సైతం అంగీకరించారు. మండ్య మినహా ఎక్కడైనా టిక్కెట్ ఇస్తామని సుమలతకు బీజేపీ నేతలు సూచించారు. తన కర్మ భూమి మండ్య అని, అక్కడ మినహా మరోచోట పోటీ చేయలేనని ఆమె తేల్చి చెప్పారు. ఇదే ఆఫర్‌ను కుమారస్వామికి ఇవ్వవచ్చునని, రాజ్యసభకు పంపవచ్చునని, తానెందుకు మండ్యను వదులుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సుమలతకు టిక్కెట్ ఇవ్వలేదనే విషయం శుక్రవారం స్పష్టం కావడంతో శనివారం మండ్య నుంచి పెద్ద ఎత్తున అంబరీశ్ అభిమానులు, సుమలత సానుభూతిపరులు బెంగళూరు జేపీనగర్‌కు తరలివచ్చారు. దాదాపు నాలుగైదు గంటలపాటు జేపీనగర్ ప్రాంతమంతా అట్టుడికింది. మీరు మరోసారి పోటీ చేయాల్సిందేనంటూ అభిమానులు డిమాండ్ చేశారు. పార్టీ అవసరం లేదని, ఐదేళ్ల క్రితం ఏ పార్టీ మీకు టిక్కెట్ ఇచ్చిందని, మరోసారి ఎవరి ప్రమేయం లేకుండానే గెలిపిస్తామని సూచించారు. సుమలతతోపాటు కుమారుడు అభిషేక్ అభిమానులను సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. రెండు రోజులు సమయం ఇవ్వాలని, ఏప్రిల్ 3న తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ నుంచి ఆహ్వానం వచ్చిందని, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీన్నిబట్టి సుమలత మరోసారి ఇండిపెండెంట్‌గా మండ్య నుంచి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ఐదేళ్ల క్రితం నాటి రసవత్తర పోరుకు మండ్య వేదిక కానుంది.

ఓటమి భయంతోనే బీజేపీ కుయుక్తులు

పన్నుల పేరుతో కాంగ్రెస్‌ను అణచివేయలేరు: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆగ్రహం



బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఐటీ, ఈడీ ద్వారా కాంగ్రెస్‌ను ఇబ్బంది కలిగించే కుయుక్తులు చేస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. శనివారం బెంగళూరు కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పన్నుల ద్వారా భయపెట్టి విజయం సాధించవచ్చునని బీజేపీ భావించడం కలలాంటిదే అన్నారు. సకాలంలో పన్నులు చెల్లించలేదనే ఆరోపణలు చూపి రూ.1823 కోట్లు ఐటీ శాఖ కాంగ్రెస్ పార్టీకి నోటీసులు ఇవ్వడంపై తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బీజేపీ అడ్రసు లేని 1297 మంది దాతల నుంచి రూ.42 కోట్లు పొందడాన్ని కాంగ్రెస్ నేతలు బయట పెట్టారన్నారు. తమ పార్టీకి అనుసరించే విధానాలే బీజేపీకి వర్తింపజేస్తే గడిచిన ఏడేళ్లలో రూ.4,263 కోట్ల దాకా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత ఐటీ శాఖ టీఎంసీ, సీపీఐతో పాటు పలు ప్రతిపక్ష పార్టీలపై పన్నుల ఉగ్రవాద అస్త్రాన్ని ప్రయోగించిందన్నారు. బీజేపీ పన్నుల ఎగవేతను ఐటీ గుర్తించలేక పోతోందని, కళ్లకు గంతలు కట్టుకుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు డైరీలంటూ చెప్పుకుని పన్నుల ఉల్లంఘనగా ఆరోపణలు చేసే ఐటీ అధికారులకు కర్ణాటకలోనే బయటపడ్డ యడియూరప్ప డైరీ కానీ లబ్ధిదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బిర్లా, సహారాల డైరీలు ఎందుకు కనిపించలేదని నిలదీశారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసుకుని ఎన్నికల బాండ్ల ద్వారా వేలాది కోట్లు బీజేపీ మోసం చేయడం ప్రపంచానికి తెలిసిన విషయమే అన్నారు. ఈ అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు పన్నుల ఎగవేత ఆరోపణలు చేస్తోందన్నారు. విజయ్‌మల్యా, నీరవ్‌మోదీ లాంటి బ్యాంకుల లూటీదారులకు రూ.10.09 లక్షల కోట్ల రుణమాఫీ చేయడం ద్వారా వచ్చిన కమీషన్ గురించి ప్రజలకు తెలపాల్సి ఉంటుందన్నారు. బీజేపీ అంటే అవినీతి పరుల సొమ్మును మింగి వారికి నిజాయితీ సర్టిఫికెట్ ఇచ్చే వాషింగ్ మిషన్‌గా మారిందన్నారు. 400 స్థానాలు గెలుస్తామనే ధీమాలో ఉండే మోదీ ఎందుకు ప్రతిపక్ష పార్టీలను ఇలా ఇబ్బంది పెడుతున్నారని, సీట్ల సంఖ్య గోడమీద రాసుకోవాల్సిందే అంటూ ఎద్దేవా చేశారు.

కళలు భారతీయ సంస్కృతి పరంపర

పీఈఎస్ 'ఆత్మతృష'లో నటి సప్తమిగౌడ

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కళలు భారతీయ సంస్కృతి పరంపర అని, ప్రతి వ్యక్తిలోనూ ఒక ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీస్తే వారి జీవితమే మారిపోతుందని 'కాంతార' ఫేం నటి సప్తమిగౌడ పేర్కొన్నారు. పీఈఎస్ యూనివర్సిటీలో 'ఆత్మతృష' పేరుతో నిర్వహించిన వార్షిక టెక్నికల్, సాంస్కృతిక సందడి కార్యక్రమాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సప్తమిగౌడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువు జీవితానికి ముఖ్యమని తెలిపారు. సాంకేతిక విద్యతో ప్రపంచంలో ఎక్కడైనా రాణించడం సాధ్యమవుతోందన్నారు. పీఈఎస్ యూనివర్సిటీ గురించి కొన్నేళ్లుగా తనకు తెలుసు అని కొనియాడారు. ఇక్కడ క్రమశిక్షణ, గుణాత్మకమైన విద్య ఉందని అన్నారు. యువత చదువుతోపాటు సాంస్కృతికంగానూ ఏదో ఒక రంగంపై దృష్టి సారించాలని సూచించారు. తద్వారా మానసిక ప్రశాంతతతోపాటు ఎటువంటి ఒత్తిడినైనా అధిగమించవచ్చునన్నారు. హొంబాళె ఫిలిమ్స్ డిజిటల్ ముఖ్యుడు అభినాశ్ వి. నాయుడు మాట్లాడుతూ సినిమా రంగంలోనూ డిజిటల్ ద్వారా ఎన్నో ఆవిష్కరణలు సాధ్యమయ్యాయన్నారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జె.సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కేఎస్ శ్రీధర్, ప్రొ-వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ నాగార్జున, డీన్ వి. కృష్ణ పాల్గొన్నారు. టీమ్ హోప్స్‌తోపాటు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ఆత్మతృష కార్యక్రమంలో నటి సప్తమిగౌడ తదితరులు

గోవిందా.. గోవింద!

కన్నుల పండువగా ఖాద్రీశుడి రథోత్సవం



కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథంపై కొలువుదీరిన స్వామివారు



పుణ్యాహవచనం నిర్వహిస్తున్న వేదపండితులు



రథోత్సవంలో భక్తజన సందోహం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం కన్నుల పండువగా సాగింది. ఈ తేరు మహోత్సవాన్ని చూడటానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి చుట్టుపట్లే కాకుండా కడప, చిత్తూరు, కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు తరలిరావడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే తిరువీధుల్లో సందడి నెలకొంది. శనివారం ఉదయం అశేష భక్తజన వాహిని నడుమ శ్రీవారి తేరును ఆలయ అధికారులు, నిర్వాహకులు ముందుకు కదిలించారు. ఈ కదిలే తేరుపై భక్తులు దవనం, మిరియాలు చల్లారు. తేరు కదులుతున్న సమయంలో తిరువీధులన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. దాదాపు నాలుగున్నర గంటలకు పైగా సాగిన స్వామివారి రథయాత్ర ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముగిసింది. యువతీ, యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి ప్రయత్నించారు. రథోత్సవం సందర్భంగా పలుచోట్ల అన్నదానం చేశారు. - కదిరి




రథోత్సవంలో యువకుల విన్యాసం..



భక్తుల కోలాహలం...



ఇదిగో హారతి..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,580.85	1,586.84
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	860	6,536
సామర్థ్యం (టీఎంసీలు)	4.90	8.59

ఘనంగా శ్రీ వ్యాసరాజ ఆరాధన



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారి సిటీ, మార్చి30: రేడియో పార్కు శ్రీ వ్యాసరాజ మఠంలో స్వామివారి ఆరాధనోత్సవాలు శుక్రశనివారాలలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేంకటేశ్వర అష్టోత్తరం, వాయుస్తుతి పారాయణ, రాఘవేంద్రాష్టమి నిర్వహించారు. పూజలో భాగంగా పండితులు ప్రత్యేక ఉపన్యాసాలు చేశారు. రథోత్సవంలో మహిళా మండళ్ల కోలాటం, దేవరనామాలతో సామూహిక సంకీర్తనలు జరిగాయి. పూజల నిమిత్తం పంచబృందావనాలను నూతన వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆరాధన సందర్భంగా శ్రీవాదిరాజులు, శ్రీవ్యాసరాజుల గురించి ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ మఠం అర్చకులు పాండురంగాచార్య అభినందనలు తెలిపారు.

అగ్నిప్రమాదంలో చెట్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఫల వృక్షాలు

బళ్లారి సిటీ,మార్చి 30: సండూరు తాలూకా సుశీలానగర్ గ్రామ సమీపంలోని ఓ రైతు తోటలో పెంచిన వందలాది మొక్కలు ప్రమాదవశాత్తు మంటల్లో కాలిపోయాయి. ఉల్లిని విక్రయించేందుకు ఆ రైతు బెంగళూరు వెళ్ళిన సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది, అగ్ని మాపక దళం రైతుపొలానికి వచ్చి మంటలను ఆర్పేందుకు కృషి చేసినప్పటికీ 200కు పైగా అనాస, 30సపోటా, 20మామిడి, 5బాదం, 5నిమ్మ, 5కొబ్బరి, 15రక్తచందనం, 30టేకు చెట్లు కాలి బూడిదయ్యాయి. వీటితో పాటు గొట్టపు బావికి సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ఉద్యానవన శాఖ వారు వేసిన పైపులైన్ కాలిపోయాయి. ఈవిషయమై పొలం యజమాని మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ విధానంలో పెంచి ఫలాలను ఇస్తున్న వందలాది మొక్కలు దగ్ధమయ్యాయని తెలిపారు. గ్రామ గుమాస్తా దేవరాజ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, మార్చి 30 : ఘనంగా పేటే ఆంజనేయ స్వామికి శనివారం పుష్పాలంకార సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపి పుష్పాలతో అలంకరించారు. ఆకుపూజ, మహామంగళహారతి కార్యక్రమాలను చేపట్టారు. శనివారం కావడంతో దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఈ పేటే ఆంజనేయస్వామికి భక్తులు ధూపదీప నైవేద్యాలతో మొక్కుబడులను తీర్చుకున్నారు.

కీలకట్లతో శ్రీశైలానికి!

పాదయాత్ర చేపట్టిన సంగనకల్ వాసులు

ఉగాది పర్వదినం నాడు మల్లన్న దర్శనం కోసం కర్ణాటక నుంచి శివభక్తులు వేల సంఖ్యలో శ్రీశైలానికి పాదయాత్ర చేపట్టారు. వీరిలో సంగనకల్‌కు చెందిన మల్లికార్జున అనే యువకుడు కాళ్లకు కీలకట్లు కట్టుకుని స్వామి దర్శనానికి బయలుదేరాడు. మరికొంత మంది శివుని దర్శనం కోసం 50 కిలోల ధాన్యం మూటలు మోసుకుంటూ బయలుదేరారు. వీరందరూ ఒక బృందంగా కర్ణాటక సంగనకల్ నుంచి శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం వెళ్లడం పలువురిని ఆకర్షిస్తోంది. --బళ్లారిరూరల్



కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు ఖాయం/ కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్



తుకారాంను, గణేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

కంప్లి, మార్చి 30 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు ఖాయమని కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. నియోజకవర్గంలోని చివరి గ్రామాలైన హడలిగి, బసరకోడు, కరచేడు తదితర గ్రామాల్లో శనివారం తుకారామ్ ప్రచారాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో వుండే గాదెలింగప్ప తాత దర్శనం చేసుకున్నారు. అనంతరం హడలిగిలో తుకారామ్‌ను, ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌ను కార్యకర్తలు గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఇచ్చిన మాట తప్పదన్నారు. ప్రజలకు అండగా వుండేది కాంగ్రెస్ పార్టీనేనన్నారు. బీజేపీ మాదిరిగా టీవీలకు, పేపర్లకు పరిమితం కాదన్నారు. తమ ఎంపీ అభ్యర్థి ఈ తుకారామ్ సండూరు నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని, అదే మాదిరిగా జిల్లాలో ఎంపీగా గెలుపొందినట్లయితే జిల్లాను ఆదర్శజిల్లాగా తీర్చిదిద్దుతారని తెలిపారు. అనంతరం తుకారామ్ మాట్లాడుతూ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలు తమకు గెలుపునిస్తాయన్నారు. ఈ ప్రచారంలో కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎండల దెబ్బకు రహదారిగా మారిన తుంగభద్ర

బళ్లారి సిటీ,మార్చి 30: బళ్లారి జిల్లాలోని నిట్టూరు-సింగపూర్ సమీపంలోని తుంగభద్ర నది ఎండిపోవడంతో హరిగోలు మీదుగానది దాటే ప్రజలు విధిలేక బైక్‌లు తోసుకుంటూ ఒడ్డుకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ 2018లో కొప్పళ ఎంపీ కరడి సంగన్న చేతుల మీదుగా ప్రారంభించిన నిట్టూరు- సింగపూర్ వంతెన నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు నిత్యం ఇబ్బందులపాలవుతున్నారు. నిట్టూరు-సింగపూర్ బ్రిడ్జి పనులకు తొలుత రూ.80 కోట్లు అంచనా వేసిన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసినా ఆ తర్వాత భూసేకరణ ప్రక్రియలో ఇబ్బందుల కారణంగా పనులు నిలిచిపోయాయి. గత డిసెంబర్‌లో వంతెన నిర్మాణం కోసం జిల్లా యంత్రాంగం సీఈపీఎంఐజడ్ పథకం కింద రూ. 13.60 కోట్లను రిజర్వ్ చేసింది. రెండు గ్రామాల మధ్య వంతెనను నిర్మించడం ద్వారా హుబ్లీ నుండి ఆంధ్రాలోని తిరుపతికి నేరుగా వెళ్లవచ్చు. అలాగే కరటగి నుంచి సిరుగుప్ప వరకు దాదాపు 79కిమీటర్ల దూరం తగ్గుతుంది. ఇది సిరుగుప్ప తాలూకా సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందని ఈ ప్రాంత ప్రజలు అంచనా వేస్తున్నారు.



ఇసుకలో బైక్‌లు తోసుకుంటూ ఒడ్డుకుచేరుకుంటున్న గ్రామస్థులు

అనవసరంగా బయట తిరగొద్దు: డీహెచ్‌ఓ



డీహెచ్‌ఓ డాక్టర్ రమేశ్ బాబు

బళ్లారి సిటీ,మార్చి 30: జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఎండలు తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఇళ్ళలోనే ఉండాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్ బాబు కోరారు. ప్రస్తుతం వేసవిలో సాయంత్రం 4గంటల వరకు బయటకు రాకూడదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సిన అవసరం వచ్చినప్పుడు వాటర్ బాటిల్, గొడుగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పిల్లల తలపై వీలైనంత వరకు నీటితో తడిసిన గుడ్డను ఉంచాలని, వీలైనంత వరకు నీడలో ఉండేలా చూడాలని ఆయన తెలిపారు. దాహం వేయకపోయిన తరచుగా నీరు పుష్కలంగా త్రాగాలన్నారు. ఓఆర్ఎస్ తీసుకోవడం మంచిదన్నారు. పుచ్చకాయ, నారింజ, ద్రాక్ష, పైపాపిల్,దోసకాయ,వాటర్ క్రెస్ వంటి ప్రస్తుత సీజనల్ పండ్ల రసాలను చిటికెడు ఉప్పుతో తీసుకోవడం ఉత్తమం అన్నారు. లేత తెలుపు రంగు వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిదని, నడిచేటప్పుడు బూట్లు ,చెప్పులు ధరించాలన్నారు.

పెద్దలలో అపస్మారక స్థితి, స్పృహ కోల్పోడం,భయాందోళన, అధిక తలనొప్పి, మైకం, కండరాలలో అలసట లేదా వికారం, వాంతులు పిల్లలు తినడానికి నిరాకరించడం తక్కువ మూత్రవిసర్జన, నోరు పొడిబారడం, నీరసం, మూర్ఛ, శరీరంలో రక్తస్రావం లక్షణాలు కనిపిస్తే డాక్టరును సంప్రదించాలన్నారు. అలాగే వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్, జిల్లా విపత్తు అథారిటీ జారీ చేసిన సూచనలను తప్పకుండా పాటించాలని డీహెచ్‌ఓ అభ్యర్థించారు.

కళాకారులను ప్రోత్సహించడంలో దిట్ట బీసీఏఏ

బళ్లారి సిటీ, మార్చి 30: మన సంస్కృతిని కాపాడుతూ కళాకారులను ప్రోత్సహిస్తున్న సంస్థ బళ్లారి కల్చరల్ అసోషియేషన్ అని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మహారుద్రగౌడ అన్నారు. బీసీఏఏ 51వ వార్షికోత్సవం సందర్భంగా ఉగాది పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని శనివారం బీపీఎస్‌కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కళాకారులను గుర్తించి గౌరవించడంలో ఈ సంస్థ ముందుంటుందన్నారు. ఈసందర్భంగా డాక్టర్ మల్లేశ్, ఎన్.విరుపాక్షప్పలకు ఉగాది పురస్కారం, గురుశాంతప్ప, కుమారస్వామి, నాగరాజులకు బళ్లారి రాఘవ పురస్కారం, జనార్దన్‌రావుకు ఘంటసాల పురస్కారం, జాదవ్‌కు రవివర్మ అవార్డు, రంగనాయకులు, మేఘన, జ్యోతిక, వైష్ణవి, పల్లవిలకు నటరాజ నాట్య శిరోమణి అవార్డు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యశంత్‌రాజ్, రామచంద్ర, శీలబ్రహ్మయ్య, శ్రీనివాస్‌రావు, కేసిబాబు, మంజునాథ్, సి.నాగభూషణం, శేషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న రంగస్థల కళాకారులు కుమారస్వామి,గురుశాంత్

వైభవంగా శరణు బసవేశ్వరస్వామి రథోత్సవం



హెచ్ వీరాపురంలో సాగుతున్న రథోత్సవం

కంప్లి, మార్చి 30 : కురుగోడు తాలుకా పరిధిలోని హెచ్ వీరాపురం గ్రామంలో శరణు బసవేశ్వర రథోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. కలబురిగి శరణు బసవేశ్వర రథోత్సవాన్ని పురస్కరించుకుని ఈ గ్రామంలో భక్తాదులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం రథాన్ని గ్రామంలో ఊరేగించారు. ప్రతి యేటా రథోత్సవాన్ని గ్రామంలో పండుగలా జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు. ఆ గ్రామంతో పాటు సోమలాపురం, ఎమ్మిగనూరు, కురుగోడు, ముష్టిగట్టి, ముద్దటనూరు, సిరిగేరి, కలకంబ్ల, ఓర్వాయి, గుత్తిగనూరు తదితర గ్రామాల నుంచి ఎద్దుల బండ్లపై భక్తులు తరలివచ్చి శరణు బసవేశ్వరస్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.

పశుపక్ష్యాదుల దాహార్తిని తీర్చాలి : డీసీ

కంప్లి, మార్చి 30 : అడవుల్లో వుండే పశుపక్ష్యాదులకు, ప్రాణులకు దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ విజ్ఞప్తిచేశారు. విజయనగర జిల్లా హోస్పేట తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామం వద్ద వుండే అడవుల్లో పశుపక్ష్యాదుల కోసం శనివారం నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు పెరిగిపోతున్నాయని, ఎండవేడిమి తట్టుకోలేక మానవులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి ఒక్కరు తమ చుట్టుపక్కల చిన్న చిన్న తొట్టెలు, కుంటలు, ఏర్పాటు చేసి మూగజీవుల దాహార్తిని తీర్చాలన్నారు. అలాగే రానున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఇళ్లల్లో కూడా నీటిని కూడా వృథా చేయరాదన్నారు. తమకు కావాల్సిన నీటిని మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఎండవేడిమికి జలాలు ఇంకిపోయి నీటి సమస్య కూడా తలెత్తుతోందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడిగా చిదానంద



చిదానందకు నియామక పత్రం అందిస్తున్న తుకారామ్

కంప్లి, మార్చి 30 : కురుగోడు తాలుకా పరిధిలోని సోమసముద్రం గ్రామానికి చెందిన ఎన్ చిదానంద కురుగోడు బ్లాక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయనకు ఎంపీ అభ్యర్థి తుకారామ్, ఎమ్మెల్యే జేఎన్ గణేష్ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా చిదానంద మాట్లాడుతూ తనకు యువ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషంగా వుందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కేఎస్ఎల్ స్వామి, వీటీ క్యాంపు రఘు, కౌన్సిలర్లు మల్లికార్జున ఓంకారప్ప, శేకన్న, నాగరాజు, కోళూరు వన్నూరుస్వామి, మధు, శ్రీను, బంగి మల్లయ్య పాల్గొన్నారు.

సౌదాగర్ మసీదులో ఇఫ్తార్ విందు



సౌదాగర్ మసీదులో ఇఫ్తార్ విందు ఆరగిస్తున్న ముస్లింలు

సిరుగుప్ప, మార్చి 30 : రంజాన్ సందర్భంగా రాయచూరు రాఘవేంద్రశెట్టి ఆధ్వర్యంలో సౌదాగర్ మసీదులో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. సిరుగుప్ప పట్టణంలో ఉపవాసదీక్షలు చేస్తున్న వారిలో ప్రముఖులైన ముస్లింలు, గురువులు, భక్తులు ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

కంప్లి, మార్చి 30 : కలియుగంలో పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో ముందడుగు వేయాలంటూ రాష్ట్ర అంగన్‌వాడీ సంఘం ప్రధాన కార్యదర్శి సునంద తెలిపారు. కుడితిని పట్టణంలోని వాల్మీకి భవన్‌లో అంతర్రాష్ట్ర మహిళా దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ప్రతి రంగంలో రాజకీయంగా పురుషులతో సమానంగా ముందడుగు వేయాలన్నారు. మహిళలు ఇళ్లకే పరిమితం కాకుండా ధైర్యంగా ముందుకొచ్చి తమకు నచ్చిన ఉద్యోగాలలో గానీ, స్వశక్తితో గానీ పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా వుండాలన్నారు. మహిళలపై దౌర్జన్యాలు, అరాచకాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వాలు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం పలువురికి శాలువా, పూలమాలలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి, చెన్నబసయ్య, బీటీపీఎస్ కార్మిక సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి, దుర్గమ్మ, వెంకటేష్, ఖాజాబన్నీ, ఈరమ్మ, రుద్రమ్మ, ఉచ్చమ్మ, గిరిజమ్మ, గాదెలింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

పాఠశాలకు బాంబు బెదిరింపు



పాఠశాలలో తనిఖీ చేస్తున్న సిబ్బంది

హోసూరు, మార్చి 30: హోసూరు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ తాలూకాలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు శనివారం బాంబు పెట్టామని బెదిరింపు ఇ-మెయిల్ వచ్చింది. హులిమంగల ప్రాంతంలోని ఈ పాఠశాల తరగతి గదిలో టేబుల్‌కింద బాంబు ఉందని మెయిల్‌లో పేర్కొన్నారు. వెంటనే పాఠశాల యాజమాన్యం హెబ్బగూడి పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే బాంబు స్క్వాడ్, స్నిఫర్ డాగ్‌లను రప్పించి రంగంలోకి దించారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎటువంటి పేలుడు పదార్థం లభించలేదు. దీంతో ఉత్తుత్తి పోలీసు బాంబు బెదిరింపుగా గుర్తించారు. కాగా అంతకుముందు సమాచారం అందుతూనే విద్యార్థులను పాఠశాలనుంచి తక్షణం పంపించారు. గతంలో కూడా పలుస్కూళ్లకు ఉత్తుత్తి బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి విదితమే.

భారీగా నగదు, దుస్తుల స్వాధీనం

హోసూరు, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిఘాను మరింత తీవ్రతరం చేశారు. సరైన రికార్డులు లేకుండా కర్ణాటక నుంచి గిఫ్ట్‌బాక్స్‌లు, వస్తువులు, నగదును తరలిస్తున్నట్టు గుర్తించి చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి అబ్రా నేతృత్వంలో జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల వేళ బట్టల వ్యాపారి కుమార్ నుంచి 137 షర్టులను గుర్తించారు. రికార్డులు లేకపోవడంతో సబ్‌కలెక్టర్ ప్రియాంకకు అప్పగించారు. అలాగే గుడిసెట్లు సమీపాన కార్లు, బైక్‌ను తనిఖీ చేసి రూ.6,78,600 నగదు గుర్తించారు. ఇందుకు సంబంధించి ఎటువంటి రికార్డు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అప్పగించారు.

నిషేధిత గుట్కా, మద్యం బాటిళ్ల స్వాధీనం

హోసూరు(క్రైం), మార్చి 30: తమిళనాడులో నిషేధించిన గుట్కా, మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా, కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు డీఎస్పీ బాబు ప్రశాంత్ వాటిని స్వాధీనం చేసుకున్నారు. మత్తిగిరి సమీపంలోని కర్నూర్ చెక్‌పోస్టు వద్ద 240 కర్ణాటక మద్యం బాటిళ్లను గుర్తించారు. హోసూరు భారతీదాసన్ నగర్‌కు చెందిన మంజునాథ్ (44)ను అరెస్ట్ చేసి కారును కూడా సీజ్ చేశారు. హోసూరు బస్ స్టేషన్ సమీపంలో ఏఎస్‌టీసీ హడ్కో పోలీసులు వాహనాల తనిఖీల్లో రాజస్థాన్‌కు చెందిన సుజనారామ్(35) ఓ ప్రైవేట్ ఓమ్నీ వాహనంలో సుమారు 60 కిలోల గుట్కాను తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా శూళగిరి సమీపంలోని ఓడయనూరు వద్ద నేషనల్ హైవే పెట్రోలింగ్ విభాగం అధికారులు వేగంగా వెళ్తున్న కారును వెంబడించి అందులో 165 కిలోల నిషేధిత పొగాకు ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ పారిపోయాడు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



స్వాధీనం చేసుకున్న గుట్కా తదితర వస్తువులు

అభివృద్ధి కోసం అవకాశం కల్పించండి

● కాంగ్రెస్ అభ్యర్థి కుమార్ నాయక్ వినతి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ నాయక్

రాయచూరు, మార్చి 30 : ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ శాఖల్లో పనిచేసిన తనకు రాయచూరు జిలా కోసం ప్రజాప్రతినిధిగా సేవచేసే అవకాశం కల్పించాలని లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి జీ కుమార్ నాయక్ కోరారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని కుమార్‌నాయక్ మాట్లాడారు. గతంలో జిల్లాధికారిగా పనిచేసిన తాను జిల్లాలోని సమస్యలను ఇక్కడి వాస్తవ పరిస్థితులను స్పష్టంగా అర్థం చేసుకున్నానన్నారు. ఇందుకోసం నిబద్ధతతో పని చేసే రాజకీయ నాయకత్వం అవసరమన్నారు. ఆ దిశగా పని చేసే అవకాశం తనకు కాంగ్రెస్ పార్టీ కల్పించిందని ప్రజలు తనను ఆదరించి అండగా నిలవాలని అభ్యర్థించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలకు కట్టుబడి ఉన్నామన్నారు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు పరిష్కారం చూపించే శక్తి కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అధికారంలో ఉన్నవారు భ్రమల మధ్య జీవింపజేస్తున్నారని అలాంటి వారిని కాకుండా అభివృద్ధి కోసం పని చేసే వారిని గెలిపించాలని కోరారు.

సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం.. మూడు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్ధం

రాయచూరు, మార్చి 30 : నగరంలోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకోగా మూడు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడంతో ఒక్కసారిగా నగరమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి మొదలుకొని శనివారం తెల్లవారు జామున 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోడంతో నగరమంతా చీకట్లోనే మగ్గాల్సి వచ్చింది. వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో తెల్లార్లు విద్యుత్ సరఫరా లేక ప్రజలు నిద్రలేని రాత్రిని గడపాల్సి వచ్చింది. కాగా ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి అదుపు చేశారు. అనంతరం జెస్కాం సిబ్బంది నాలుగు గంటలకు పైగా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

సర్ ఐజాక్ న్యూటన్ (వర్ధంతి)



సైన్సు పితామహ'గా అభివర్ణించబడే సర్ ఐజాక్ న్యూటన్ 1643 జనవరి 4న లండన్‌లో జన్మించారు. ఆంగ్లేయ భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఒక సిద్ధాంతకర్త, తత్వవేత్త కూడా. గురుత్వాకర్షణ శక్తి గురించి ఆయన మూడు గమన నియమాలను ప్రస్తావించారు. యాంత్రిక శాస్త్రానికి, ఆధునిక ఇంజనీరింగ్‌కు ఇదే పునాది. కెప్లర్ నియమాలకు, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్యకేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలగి ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్తపుంతలు తొక్కింది. 1727 మార్చి 31న కన్నుమూశారు.

షీలా దీక్షిత్ (జయంతి)



షీలా దీక్షిత్ 1938 మార్చి 31న పంజాబ్ రాష్ట్రం కపూర్తలాలో జన్మించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగానే కాక దేశంలో సుదీర్ఘకాలం పాలన అందించిన మహిళా సీఎంగా పేరొందారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీనుంచి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా వ్యవహరించారు. జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఇండియాచే 2008లో ఉత్తమ ముఖ్యమంత్రి గుర్తింపు పొందారు. 2019 జూలై 20న కన్నుమూశారు.

అక్టేవియో పాజ్ (జయంతి)



నోబెల్ పురస్కార గ్రహీత అక్టేవియో పాజ్ లొజానో 1914 మార్చి 31న మెక్సికోలో జన్మించారు. కవి, రచయితగా పేరొందారు. తన జీవితకాలంలో పలు సాహితీ అంశాలు, రచనలను ఇతర భాషలలోకి అనువాదం చేశారు. ఆయన రచనలపై మార్క్సిజం, బుద్ధిజం, హిందూయిజం ప్రభావం చూపాయి. 1981లో స్పానిష్‌లో అత్యున్నత 'మిగెల్ డి సెర్వాంటెజ్ ప్రైజ్, 1982లో న్యూస్‌డట్ ఇంటర్నేషనల్ ప్రైజ్ ఫర్ లిటరేచర్ ఇతర గౌరవాలు అందుకున్నారు. 1998 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

కోనేరు హంపి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కోనేరు హంపి 1987 మార్చి 31న గుడివాడలో జన్మించారు. చదరంగం పోటీలలో 2019లో ఉమెన్స్ వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌గా నిలిచారు. 15ఏళ్లకే అంటే 2002లో 'గ్రాండ్‌మాస్టర్' హోదా సాధించిన ఘనత. ఫైడ్ ఉమెన్స్ గ్రాండ్ ప్రిక్స్ సిరీస్‌లో 2011-12, 2013-14, 2015-16 ఎడిషన్స్‌లో రన్నర్-అప్‌గా నిలిచారు. 2015లో వరల్డ్‌టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్యపతకం సాధించారు. అర్జున పురస్కారం, బీబీసీ ఇండియన్ స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, ఇతర అవార్డులు సాధించారు.

ఇరువర్గాల పోరులో మూడోవ్యక్తికి కోలారు టిక్కెట్



సీఎంతో గౌతమ్‌కుమార్ తదితరులు

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కోలారు లోక్‌సభ టిక్కెట్ ఉత్కంఠకు తెరపడింది. ఇరువర్గాల పోరులో మూడో వ్యక్తికి టిక్కెట్ లభించింది. మాజీ మేయర్ విజయ్‌కుమార్ కుమారుడు గౌతమ్‌కుమార్ అభ్యర్థి అయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ శనివారం ప్రకటించింది. కోలారులో ఏడుసార్లు ఎంపీగా గెలుపొంది గ్రూపు విభేదాలతో 2019 ఎన్నికల్లో ఓటమి చెంది ప్రస్తుతం మంత్రిగా వ్యవహరిస్తున్న కేహెచ్ మునియప్ప తన కుటుంబికులలో ఒకరికి టిక్కెట్ సాధించుకోవడానికి గట్టిగా పట్టుబట్టారు. దీనిపై మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ వర్గీయులైన మంత్రి సుధాకర్, ఆనంద్‌కుమార్ సహా పలువురు రాజీనామా చేస్తామని హెచ్చరించారు. మునియప్ప, రమేశ్‌కుమార్ గ్రూపుల మధ్య తలెత్తిన విభేదాలను పరిష్కరించేందుకు సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎవరికివారుగా అన్ని విషయాలను అంగీకరించినా టిక్కెట్ తమ వర్గీయులకే ఇవ్వాలని మెలిక పెట్టారు. ఏ వర్గానికి టిక్కెట్ కేటాయించినా మరోవర్గం వారు ఎన్నికల్లో పనిచేయకపోతే అసలుకే మోసం వస్తుందని సీఎం, డీసీఎం కొత్త అభ్యర్థిని తెరపైకి తెచ్చారు. గౌతమ్‌కుమార్‌కు టిక్కెట్ ప్రకటించగానే డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ కోలారులో వర్గాలు వీడి అందరూ కలసి పనిచేయాల్సిందేఅన్నారు. కోలారు లోక్‌సభ అభ్యర్థిగా గౌతమ్‌కుమార్ పేరు ప్రకటించగానే ఆయన నేరుగా సీఎం సిద్ధరామయ్యను కలిశారు. ఆయన ఆశీస్సులు పొందారు. తర్వాత డీకే శివకుమార్‌ను కలసి బీ-ఫారం తీసుకున్నారు.

వీలింగ్‌కు పాల్పడినవారిపై చర్యలు తీసుకోండి



వీలింగ్ చేస్తున్న దృశ్యం

బంగారపేట, మార్చి 30: తాలూకాలోని కామసముద్ర మెయిన్‌రోడ్డుపై బైక్‌పై యువకులు ప్రమాదకరంగా వీలింగ్ చేయడాన్ని స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇతరు వాహనదారులకు ప్రమాదం కలిగించేలా వీలింగ్ చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాలూకాలో ఇటీవల వీలింగ్ చేసేవారు అధికమ య్యారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి పలువురు మొబైల్‌లో వీడియోలు తీసి వీలింగ్ చేసేవారి తీరును మండిపడ్డారు. పోలీసులు తగిన చర్యలు తీసుకో వాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ స్టార్ క్యాంపైనర్లుగా 40 మంది

- రాష్ట్రానికి చెందిన వారు 26 మంది
- టిక్కెట్ దక్కని సదానందగౌడ, ప్రతాప్‌సింహకు చోటు

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ స్టార్ క్యాంపైనర్‌ల జాబితాను ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు 40మంది పేర్లను పార్టీ జాతీయ కమిటీ శనివారం ప్రకటించింది. ఇందులో 26మంది రాష్ట్రానికి చెందిన నాయకులు ఉన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ దక్కని ప్రతాప్‌సింహ, సదానంద గౌడలు క్యాంపైనర్‌ల జాబితాలో ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాతోపాటు పలువురు ఉన్నారు. రాష్ట్రానికి సంబంధించి యడియూరప్ప, బీవై విజయేంద్ర, ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, నారాయణస్వామి, ఆర్ అశోక్, బసవరాజ్ బొమ్మై, సుధాకర్, జగదీశ్‌శెట్టర్, నళిన్‌కుమార్ కటీల్, సీటీ రవి, గోవిందకారజోళ, డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, శ్రీరాములు, అరవింద లింబావళి, సునిల్‌కుమార్, జీవీ రాజేశ్, ప్రీతంగౌడ, పీ రాజీవ్, బసనగౌడపాటిల్ యత్నాళ్, భైరతి బసవ రాజ్, ప్రమోద్ మధ్వరాజ్, చలవాది నారాయణస్వామి, ఎన్ మహేశ్ ఉన్నారు. మాజీ మంత్రి ఈశ్వరప్ప పేరు జాబితాలో లేదు. ఏకంగా 26మంది రాష్ట్ర నేతల్లో స్టార్ క్యాంపైనర్‌ల పేర్లు ఉండగా ప్రభావితమైన సుమలత, యదువీర్, డాక్టర్ సీఎన్ మంజునాథ్, అనంతకుమార్ హెగ్డేలకు చోటు కల్పించలేదు. ఇదే విషయమై పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్ మీడియాతో మాట్లా డుతూ కేవలం జాబితాలో ఉన్నవారు మాత్రమే క్యాంపైనర్‌లు కాదని, ఎన్నికల కమిషన్‌కు 40మంది పేర్లు మాత్రమే పంపాల్సి ఉన్నందున కొందరికే పరిమితం చేశామన్నారు.

ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యం పెంచుకోవాలి

- సిటీ గ్రూప్ కళాశాలలో మోనికా కల్లూరి పిలుపు

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉద్యోగాల సాధనకై నైపుణ్యతను పెంచుకోవాలని సిటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ మోనికా కల్లూరి పిలుపునిచ్చారు. సిటీ కళాశాలలో శనివారం బిజినెస్ టాక్ షో ఇండస్ట్రీ సదస్సు జరిగింది. కార్యక్రమంలో సీఎస్ఐఆర్ సీనియర్ శాస్త్రవేత్త వేణుగానాపురం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రం, దేశానికే పరిమితంగా చదువు కొనసాగేదన్నారు. ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా ఉద్యోగాలు, ఆవిష్కరణలకోసం పోటీ పడాల్సి ఉందన్నారు. ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు అలవరుచుకోవాలని తద్వారా పరిశ్రమలకు అవసరమైన ఉద్యోగాలు సులువుగా పొందవచ్చునన్నారు. విప్రో గ్లోబల్‌హెడ్ ప్రకాశ్ మహాపాత్ర మాట్లాడుతూ జీవితంలో అత్యంత విలువైన సమయం విద్యార్థిదశ అన్నారు. చదువు, నైపుణ్యత ఎవరూ దోచుకుపోలేరన్నారు. సాంకేతికంగా కొన్ని సందర్భాలలో ఉద్యోగాలు కోల్పోయినా ప్రత్యామ్నాయంగా నైపుణ్యంతో ఉద్యోగం సాధించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. టెక్-బి డిప్యూటీ మేనేజర్ పవన్‌శర్మ, పిఫైనిటీ ఎడ్యుకేషన్ ఫౌండర్ శీతల్ కాలరతోపాటు పలువురు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ పుట్టరాజు ఆధ్వర్యంలో సదస్సు జరిగింది.



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

మాడికెరెలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథోత్సవం

చింతామణి, మార్చి 30: తాలూకాలోని మాడికెరె క్రాస్‌లో కొలువైన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉత్సవాల్లో ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మరథోత్సవం, దీపోత్సవం ఘనంగా జరిగింది. సుప్రభాత సేవ, స్వామివారికి పంచామృత అభిషేకం, కళశారాధన, హోమం, బలిహరణ, కాశీయాత్ర మహోత్సవం అనంతరం స్వామి వారికి కల్యాణోత్సవం, గరుడోత్సవం, మహామంగళారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలైన ఊలవాడి, కురుటహళ్ళి, దొడ్డగంజూరు, బూరగ మాకల హళ్ళి, ఐమరెడ్డిహళ్ళి, చీమనహళ్ళి గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పలువురు పానకం, మజ్జిగ, పెసరబేడలు పంపిణీ చేయగా అన్నదానోహం సాగింది. పండరి భజన, కోలాట, డప్పు వాద్య బృందాలు రథోత్సవంలో సందడిగా నిలిచాయి. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చింతామణి రూరల్ పోలీసులు తగిన బందోబస్తు కల్పించారు.

ఓటు హక్కుపై జాగృతి

చింతామణి రూరల్, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వందశాతం పోలింగ్ సాధించే దిశగా ఓటుహక్కుపై జాగృతి జాథాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో ఊలవాడి గ్రామపంచాయతీ పరిధిలోని బూరగమాకలహళ్ళి గ్రామం ఆంజనేయస్వామి ఆలయం నుంచి మాడికెరె క్రాస్ వరకు జాథా సాగింది. ఆంజనేయస్వామి దేవాలయం వద్ద రంగవల్లులు వేయడం ద్వారా ఓటు ప్రాధాన్యతను వివరించారు. జానపద కళాబృందాలు సైతం ఉత్సాహంగా పాల్గొన్నాయి. డీఎస్పీ మురళీధర్, తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్, బీఈఓ ఉమాదేవి, నరేగా సహాయక డైరెక్టర్ కవిత, ఊలవాడి గ్రామపంచాయతీ సభ్యుడు అశోక్‌రెడ్డి, భూరగమాకలహళ్ళి గ్రామపంచాయతీ సభ్యుడు అశ్వథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'మన ఓటు మన భవిష్యత్తు' అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. గత ఏడాది ఓటింగ్ బహిష్కరించిన, పోలింగ్‌శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలను సందర్శించి ప్రజలను చైతన్య పరుస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు తమ ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలన్నారు. కవితా మాట్లాడుతూ 80ఏళ్లు పైబడినవారు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించారని ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

మేలూరులో..

శిడ్లఘట్ట, మార్చి 30: తాలూకాలోని మేలూరులో గ్రామపంచయాతీ స్వీప్ సమితి ఆధ్వర్యంలో ఓటుహక్కుపై జాగృతి కార్యక్రమం నిర్వహించారు. పీడీఓ శారద ప్రారంభించి మాట్లాడుతూ మనదేశంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ సామాన్య ప్రజలనుంచి ప్రధానమంత్రి, రాష్ట్రపతి కూడా సమాన ఓటు హక్కు ఉంటుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమన్నారు. కావున ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుని సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలన్నారు. పురవీధులలో ర్యాలీ సాగింది. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



గ్రామపంచాయతీ స్వీప్ సమితి ఆధ్వర్యంలో జాగృతి

ప్రమాదాల నియంత్రణపై మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో తహసీల్దార్ తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 30: రసాయన ప్రమాదాలు వంటి సమస్యలు తలెత్తినప్పుడు ఎలా నియంత్రించాలనే అంశంపై జాతీయ విపత్తు నిర్వహణ బృందం, జిల్లా అత్యవసర విభాగం సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన మాక్ డ్రిల్ విజయవంతమైనట్టు తహసీల్దార్ బీఎస్ స్వామి తెలిపారు. తాలూకాలోని జంగమకోటె సమీపాన ఎల్‌పీజీ ప్రైవేట్ సంస్థ ఆవరణలో మాక్‌డ్రిల్ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీలలో అకస్మికంగా రసాయన ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, సంభవిస్తే ఎలా నియంత్రణ చేయాలి అనే అంశంపై సమగ్రంగా ప్రత్యక్షంగా వివరించారు. ఈ దిశగా కార్మికులలో అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు తెలిపారు. రసాయనాలు, ఇతరత్రా లీకేజ్ అయినప్పుడు ఆందోళన చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై వివరించారు. పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపకశాఖ సహా సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సి ఉందన్నారు. అనుకోకుండా చోటు చేసుకునే ప్రమాదాల్లో ప్రాణాపాయ బారిన పడకుండా ఎలా వ్యవహరించాలి అనే అంశంపై అరగంటపాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా 3 అంబులెన్స్‌లు, పోలీసు అధికారులు, 25మంది సిబ్బంది, జిల్లా, తాలూకా పాలనా యంత్రాంగం, ఆరోగ్యశాఖ సహా సుమారు 200మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఖాసిం, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి మహేశ్ కుమార్, జాతీయ విపత్తు నిర్వహణ విభాగం ప్రతినిధి అఖిలేశ్ చౌదరి, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, అగ్నిమాపక అధికారి బసవ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి

మహదేవపుర, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల్లో మహదేవపుర నియోజక వర్గంలో ఓటింగ్‌శాతం పెంచేందుకు ప్రజల్లో మరింత చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు సహాయక ఎన్నికల అధికారి కృపాలిని తెలిపారు. బెంగళూరు తూర్పు తాలూకా ఎన్నికల కార్యాలయంలో శనివారం ఏర్పాటైన అన్ని పార్టీల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రజలను మరింత చైతన్యం కలిగించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కాగా పార్టీలు గతంలో ఇచ్చిన ప్రకటనలను తొలగించామని ఒకవేళ అనుమతి లేకుండా కొనసాగిస్తున్నట్టు గుర్తిస్తే స్థానికులు సీ-విజిల్ యాప్ ద్వారా తమ దృష్టికి తేవచ్చునన్నారు. కాగా పిల్లలను ప్రచార కార్యక్రమాలకు వినియోగించుకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు రవి, నోడల్ అధికారి రాజేశ్, ఏసీపీ ప్రియదర్శిని, డీఎస్పీ పీ దేవరాజ్, బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నటరాజ్, ప్రముఖుడు పాపణ్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సహాయ ఎన్నికల అధికారి కృపాలిని తదితరులు

క్రికెట్ బెట్టింగ్‌ను అడ్డుకోండి



సమావేశంలో రైతుసంఘం సభ్యులు

బంగారపేట, మార్చి 30: క్రికెట్‌కు సంబంధించి ఐపీఎల్ బెట్టింగ్ దందా వల్ల కూలీలు, కార్మికులు, యువత వీధిపాలవుతున్నారని వెంటనే ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవరణలో శనివారం సమావేశమై మాట్లాడుతూ క్రీడ అనేది జూదంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. అతి త్వరగా అడ్డదారిలో శ్రీమంతులు కావడానికి బెట్టింగ్ కారణమవుతోందన్నారు. కరువు, పంట నష్టంతో ఉన్న రైతులు ఇటీవల కూలీ పనులకు వెళ్తున్నారన్నారు. సరైన ఉద్యోగం లభించక యువత నిరుద్యోగులుగా ఉన్నారని ఇటువంటి తరుణంలో క్రికెట్ బెట్టింగ్‌కు కొంతమంది తోటలను సైతం పందెం కాచినట్టు తెలుస్తోందన్నారు. నష్టపోయినవారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి బెట్టింగ్ దందాను అడ్డుకునేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్‌బెట్టింగ్‌కు కింగ్‌పిన్ ఎవరని ప్రశ్నించారు. ప్రతి ఐపీఎల్ మ్యాచ్‌లోనూ కోట్లాదిరూపాయలు చేతులు మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. మరికొంతమంది నకిలీ యాప్‌ల ద్వారా బెట్టింగ్ ద్వారా వేలం వేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇంటెలిజెన్స్ ప్రకారం ప్రతి హోటల్, రిసార్టు, బార్ అండ్ రెస్టారెంట్, దాబా, గ్రామీణ ప్రాంతాల తోటల్లోనూ నిరంతరం బెట్టింగ్ సాగుతోందన్నారు. లక్షలాది రూపాయలు కట్టి నష్టపోయిన ఎంతోమంది చివరకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే క్రికెట్ బెట్టింగ్ దందాకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ, కిరణ్, అప్పోజిరావ్, మునికృష్ణ, విశ్వ, మునిరాజు, గోవిందప్ప, శైలజ, వెంకటమ్మ, రత్నమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు తేలారు.. నామినేషన్లే తరువాయి

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్‌ల కూటమి టికెట్‌లను ఖరారు చేసింది. రాష్ట్రంలో రెండు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 26న తొలి విడత కాగా మే 7న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. తొలివిడత నామినేషన్ల దాఖలుకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. ఏప్రిల్ 4తో నామినేషన్ల దాఖలు ముగియాల్సి ఉంది. కాంగ్రెస్, బీజేపీల కూటమి 28 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ప్రస్తుత ఎన్నికల్లో ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు బరిలో ఉన్నారు. వీరిలో బీజేపీకి చెందిన జగదీశ్‌శెట్టర్, బసవరాజ్ బొమ్మై, జేడీఎస్ నేత కుమారస్వామి ఉన్నారు. ఆరుగురు మంత్రుల పిల్లలు అభ్యర్థులు అయ్యారు. గతంలో ఎన్నడూలేని విధంగా 8మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బీజేపీ నుంచి ఇరువురు పోటీ చేస్తున్నారు.

నం.	నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ/జేడీఎస్
1	ఉడుపి చిక్కమగళూరు	జయప్రకాశ్ హెగ్డే	కోట శ్రీనివాసపూజారి
2	హాసన్	శ్రేయస్‌పటేల్	ప్రజ్వల్ రేవణ్ణ (జేడీఎస్)
3	దక్షిణకన్నడ	పద్మరాజ్	కేప్టెన్ బ్రిజేశ్ చౌట
4	చిత్రదుర్గ	బీఎన్ చంద్రప్ప	గోవింద కారజోళ
5	తుమకూరు	ముద్ద హనుమేగౌడ	సోమణ్ణ
6	మండ్య	వెంకటరామేగౌడ	కుమారస్వామి (జేడీఎస్)
7	మైసూరు	ఎం లక్ష్మణ్	యదువీర్
8	చామరాజనగర	సునిల్‌బోస్	ఎస్ బసవరాజ్
9	బెంగళూరు గ్రామీణ	డీకే సురేశ్	డాక్టర్ సీఎన్ మంజునాథ్
10	బెంగళూరు ఉత్తర	ప్రొ. రాజీవ్‌గౌడ	శోభాకరంద్లాజె
11	బెంగళూరు సెంట్రల్	మన్సూర్‌ఖాన్	పీసీ మోహన్
12	బెంగళూరు దక్షిణ	సౌమ్యరెడ్డి	తేజస్విసూర్య
13	చిక్కబళ్లాపుర	రక్షా రామయ్య	డాక్టర్ సుధాకర్
14	కోలారు	కేవీ గౌతమ్	మల్లేశ్‌బాబు (జేడీఎస్)
15	చిక్కోడి	ప్రియాంక జార్కిహోళి	అన్నాసాహెబ్ జొల్లె
16	బెళగావి	మృణాల్ హెబ్బాళ్కర్	జగదీశ్‌శెట్టర్
17	బాగల్కోటె	సంయుక్తపాటిల్	పీసీ గద్దిగౌడర్
18	విజయపుర	రాజు హలగూరు	రమేశ్ జిగజిణగి
19	కలబురగి	డా.రాధాకృష్ణ దొడ్డమని	ఉమేశ్‌జాధవ్
20	రాయచూరు	కుమార్‌నాయక్	రాజా అమరేశ్వరనాయక్
21	బీదర్	సాగర్‌ఖండ్రె	భగవంత్ ఖూబా
22	కొప్పళ	రాజశేఖర్‌హిట్నాల్	బసవరాజ్ క్యావటూర్
23	బళ్ళారి	ఇ తుకారాం	శ్రీరాములు
24	హావేరి	ఆనందస్వామి గడ్డదేవరమఠ	బసవరాజ్‌బొమ్మై
25	ధారావాడ	వినోద్ అసోటి	ప్రహ్లాద్‌జోషి
26	ఉత్తరకన్నడ	అంజలి నింబాల్కర్	విశ్వేశ్వర హెగ్డే కాగేరి
27	దావణగెరె	ప్రభావతిమల్లికార్జున	గాయత్రి సిద్దేశ్వర
28	శివమొగ్గ	గీతా శివరాజ్	బీవై రాఘవేంద్ర

కొవిడ్ వ్యాక్సిన్ ఉచితంగా పొందినవారు ప్రధాని రుణం తీర్చుకోవాలి

- హావేరి అభ్యర్థి బసవరాజ్ బొమ్మై

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతటా కొవిడ్ వైరస్‌తో తల్లడిల్లుతున్న వేళ ఉచితంగా వ్యాక్సిన్ అందించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఓటు ద్వారా రుణం తీర్చుకోవాలని హావేరి బీజేపీ అభ్యర్థి బసవరాజ్ బొమ్మై అభిప్రాయపడ్డారు. హావేరి జిల్లా రాణిబెన్నూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మాట్లాడుతూ భారత్‌ను శక్తివంతం చేసేందుకు, ఉత్తమ జీవనం పెంపొందించేందుకు బీజేపీకి ఓటు వేయాలన్నారు. 2013లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, 2014లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు. 2018లో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్నా 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అపూర్వమైన మద్దతు ఇచ్చారని, 25 మంది ఎంపీలను గెలిపించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందన్నారు. కిసాన్ సమ్మాన్ పథకంలో కాంగ్రెస్ ప్రభుత్వం 4వేలు కోత పెట్టిందన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఉందని, ప్రజలు పశుసంపదను కబేళాలకు విక్రయిస్తున్నారని అయినా పశుగ్రాస కేంద్రాలు తెరవలేదన్నారు. ఎమ్మెల్యేలు పల్లెలకు వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. గ్యారెంటీలతో ఎన్నికలకు వెళ్లాలని సూచిస్తున్నా, పలు గ్యారెంటీల నగదు బదిలీ సజావుగా సాధ్యం కాకపోవడంతో మహిళలు బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం ఏకంగా 90మందికి కేబినెట్ హోదా కల్పించిందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల తర్వాత భారీగా మార్పులు చోటు చేసుకుంటాయని జోస్యం చెప్పారు.

బి-ఫారం పొందిన చిక్కబళ్లాపుర అభ్యర్థి రక్షారామయ్య



సీఎంతో రక్షారామయ్య, ఎంఆర్ సీతారాం

బెంగళూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర కాంగ్రెస్ అభ్యర్థి రక్షారామయ్య శనివారం బీఫారం పొందారు. రక్షారామయ్యతో పాటు మూడు నియోజక వర్గాలకు శుక్రవారం రాత్రి కాంగ్రెస్ ఎన్నికల కేంద్ర కమిటీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఈమేరకు చిక్కబళ్లాపుర అభ్యర్థి రక్షా రామయ్య తండ్రి, ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాంతో కలిసి ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిశారు. సీఎంకు ధన్యవాదాలు తెలిపి ప్రత్యేకంగా సన్మానం చేశారు. ఇదే సందర్భంగా ఆశీస్సులు పొందారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షులు, డీసీఎం డీకే శివకుమార్ నివాసానికి వెళ్ళి ధన్యవాదాలు తెలిపారు. ఆయన నుంచి బీఫారం పొందారు. ఇదే సందర్భంగా నామినేషన్ దాఖలులో పాల్గొనాలని ఎమ్మెల్సీ సీతారాం ఇరువురు నేతలను కోరారు.

గృహోపయోగ వస్తువులు స్వాధీనం



మూటల్లో ఉన్న కుక్కర్‌బాక్స్‌లు

చింతామణి, మార్చి 30: తగిన రికార్డులు లేకుండా సాగిస్తున్న వేలాది రూపాయల విలువైన గృహోపయోగ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ శివారులోని చింతామణి-మదనపల్లి మార్గంలో మాడికెరె చెక్‌పోస్ట్ వద్ద ఎన్నికల అధికారి అశ్వథ్ నేతృత్వంలోని బృందం తనిఖీలు చేస్తున్న వేళ శనివారం సాయంత్రం ప్రైవేట్ బస్సు టాప్‌పై సాగిస్తున్న వస్తువులను పరిశీలించారు. మూటల్లో ఉన్న 24 కుక్కర్‌లు, 8 మిక్సీలు, 22 చాపలు, 20 తవా, 2 ఐరన్‌బాక్స్‌లు, 2 టేబుల్ ఫ్యాన్‌లు, 4 గ్యాస్‌స్టవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. చింతామణి ఉప విభాగం డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ తగిన రికార్డులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

టీచర్ అనుమానాస్పద మృతి



మునిస్వామి (ఫైల్)

చింతామణి, మార్చి 30: తాలూకాలోని దొడ్డబొమ్మన హళ్ళి ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడు మునిస్వామి (40) మృతిపై అనుమానాలు తలెత్తాయి. పట్టణంలోని సొణ్ణశెట్టిహళ్ళి లే అవుట్‌లోని ఇంట్లో శుక్రవారం మృతి చెందాడు. మునిస్వామికి భార్య, కుమారుడు, ఒకుమార్తె ఉన్నారు. తాలూకాలోని యగడకోటె సమీపంలోని కొండవెనకపల్లి గ్రామానికి చెందిన మునిస్వామి కొంతకాలంగా సొణ్ణశెట్టిహళ్ళి లే అవుట్‌లోని బాడుగ ఇంట్లో ఉంటున్నాడు. ప్రతిరోజూ దొడ్డబొమ్మనహళ్ళి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి వచ్చేవాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో అపస్మారకంగా పడి ఉన్న మునిస్వామిని వెంటనే భార్య స్థానికుల సహకారంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్న అనంతరం పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. అతడి స్వగ్రామం కొండవెనకపల్లికి తీసుకెళ్లారు. శనివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. ఉపాధ్యాయుడి అకస్మిక మృతితో స్థానికంగా విషాదం నెలకొంది.